క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. బార్కాస్, సలాల, అన్వర్ మిర్చి, బాబానగర్, సీ–బ్లాక్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ గుడిమల్కాపూర్, ఏఎస్‌ఆర్‌ఆర్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని సంతోష్‌నగర్, ఎస్‌బీఐ కాలనీ, గుడిమల్కాపూర్, క్రాంతినగర్, జీవన్ కల్యాణ్‌నగర్, హిల్ కాలనీ, విజయ అపార్ట్‌మెంట్స్, సాయి అపార్ట్‌మెంట్స్, హుడా కాలనీ, సాయి గార్డెన్స్, దేవరత్న అపార్ట్‌మెంట్స్, విజయ సుశీల అపార్ట్‌మెంట్స్, గణేష్ రెసిడెన్సీ, మురాద్‌నగర్, చోటా మసీద్, సయ్యద్‌అలీ గూడ, ఆలపాటి నగర్, కాల్విన్ హోటల్, చిల్లా పిటి, పోస్ట్ ఆఫీస్, శ్రీరాంనగర్, ఎంఐజీహెచ్, ఆసిఫ్‌నగర్ ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలు, రెహమత్ డెక్కన్, మిలాన్ టాకీస్, జేబాబాగ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చాంద్రాయణగుట్ట: ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ పాలీ క్లీనిక్–ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ రఘు వరణ్, డాక్టర్ బిందు పావనీ తెలిపారు. శనివారం సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో గైనిక్, ఎముకలకు సంబంధిత పరీక్షలు, షుగర్, బీపీ, బీఎండీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాంబశివుడికి డాక్టరేట్



అబిడ్స్: హైదరాబాద్‌లో ఎంఆర్‌సెట్ ఇంజినీరింగ్ పనిచేస్తున్న సాంబశివుడికి మధ్యప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి యూనివర్సిటీ వారు పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేశారు. డిజైన్ అండ్ మోడలింగ్ ఆఫ్ ఎఫిసియాంట్ ఫ్రేమ్ వర్క్ ఆఫ్ ఈటీఎల్ ప్రాసెస్ అండ్ ఈటీఎల్ వర్క్ ఫ్లోస్ అన్న అంశంపై డాక్టర్ పంకజ కావాడకర్ ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. సాంబశివుడిని కళాశాల డైరెక్టర్ వీఎస్‌కే రెడ్డి, శ్రీనివాసరావు, శాంతి, ఆచార్యులు డాక్టర్ జయపాల్, డాక్టర్ గిరిధర్ అభినందించారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి



జలమండలి ప్రాజెక్ట్ జీఎంతో మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన జలమండలి ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ ప్రసాద్‌రావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన బోజగుట్ట శివాజీనగర్‌లో అందరూ నిరుపేదలు ఉంటారని, ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ తీవ్రంగా ఉందన్నారు. రోడ్లపై ప్రవహిస్తున్న పేదలు వారి పిల్లలు తరచూ రోగాల బారినపడుతున్నారని స్థానికులు అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని ఆయన పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జనరల్ మేనేజర్ సంబంధిత ఏరియా అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్, ప్రభు పూజారి తదితరులున్నారు.

కలిసికట్టుగా పండుగలను నిర్వహించుకోవాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. అత్తాపూర్, నార్సింగి, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని హిందూ, ముస్లిం, సిక్కు సోదరులు పాల్గొనగా.. ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకుంటూ సోదరభావంతో ఉండాలని సూచించారు. హోలీ రోజున సిక్కు సోదరులు భారీ ఊరేగింపు నిర్వహిస్తారని అందరూ దీనికి సహకరించాలన్నారు. ఈ పండుగను హిందూ సోదరులు ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలని ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించకూడదని సూచించారు. ప్రార్థన మందిరాలు, రోడ్లపై రంగులు ఆడవద్దని ఎలాంటి సమాచారం ఉన్నా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్లు నాగేంద్రబాబు, క్రాంతికుమార్ తదితరులున్నారు.

గ్యాస్ ధరల పెంపుపై సర్వత్రా నిరసన



నిరసనలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, ఆల పురుషోత్తమ్‌రావు, శాంతిదేవి

అబిడ్స్: ఎంజేమార్కెట్‌లో బీఆర్‌ఎస్ నాయకులు వంటావార్పు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం సిలిండర్ల ధరలను అడ్డగోలుగా పెంచారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

దారుసలాం చౌరస్తాలో..

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేంగా బీఆర్‌ఎస్ నాయకులు దారుసలాం చౌరస్తాలో సిలిండర్లను పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. గ్యాస్ ధరలను తరచూ మోదీ ప్రభుత్వం పెంచుతూ.. ప్రజలను తీవ్ర ఇబ్బందులపాలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆల పుషోత్తమ్‌రావు, శాంతిదేవి, సురేష్‌ముదిరాజ్, మహేందర్‌కుమార్, శంకర్‌లాల్‌యాదవ్, శ్రీనివాస్, హన్మంతరావు, సలీం, సునీల్ సాహు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరల్ని వెంటనే తగ్గించాలి..

అఫ్జల్‌గంజ్: కేంద్రం పెంచిన గ్యాస్ ధరల్ని వెంటనే తగ్గించాలని గోషామహల్ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చుడిబజార్ చౌరస్తాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పెంచిన గ్యాస్ ధరల్ని తగ్గించే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. గణేష్, వెంకటేష్, కుమార్, శివశంకర్, తెంపు, భారతీ, సురేఖ, సుమతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న శ్రీనివాస్ యాదవ్ తదితరులు

శివబాగ్ చౌరస్తా వద్ద..

గోల్కొండ: బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచడం పేదల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని బీఆర్‌ఎస్ నాయకుడు గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాశ్ అన్నారు. గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం శివబాగ్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు కట్టెల పొయ్యిపై వంట చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ, రాములు, వెంకటేష్, సత్యనారాయణ, పద్మ, ఆదిత్యయాదవ్ తదితరులున్నారు.



ఎంజేమార్కెట్‌లో.. బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్



కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు బంగారి ప్రకాశ్ తదితరులు

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్

దూద్‌బౌలి: రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నియోజకవర్గంలోని హిమ్మత్‌పురా నుంచి బారాగల్లీ వరకు వివిధ శాఖలకు చెందిన అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిమ్మత్‌పురా నుంచి బారాగల్లీ వరకు దాదాపు సగం పూర్తయ్యాయని.. మిగతా సగం పూర్తి చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు విస్తరణ కోసం ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఆయన కోరారు. పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలతో చార్మినార్ నియోజకవర్గం అభివృద్ధియే ధ్యేయంగా నిరంతరం పని చేస్తున్నామన్నారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ, జలమండలి, విద్యుత్ శాఖ, ఇంజినీరింగ్ విభాగం, చీఫ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థి మీర్జా రహమత్ బేగ్, కార్పొరేటర్లు సున్నం రాజ్‌మోహన్, ముజఫర్ హుస్సేన్ ముస్తాఫా, నాయకులు హనీఫ్, ముజ్జు, దిపేశ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్

సంతోష్‌నగర్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలకు మేమున్నామంటూ భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించామని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్ గౌస్ అన్నారు. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ఈదిబజార్, క్రీడా రోడ్డు, ఐ.ఎస్.సదన్ చౌరస్తా, కేశవదర్‌నగర్, కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంపాపేట్ గాంధీ చౌరస్తా, డీఎంఆర్‌ఎల్ ఎక్స్ రోడ్డు, ఒవైసీ ఆస్పత్రి, హఫీజ్‌బాబానగర్, మిధాని చౌరస్తా తదితర ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మహ్మద్ గౌస్ మాట్లాడుతూ... ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు డివిజన్‌లోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి కవాత్తు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ నరేశ్‌కుమార్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కిశోర్, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కుమార్, ఎస్సైలు సాయి కుమార్, పద్మయ్య, హిమారెడ్డి, అశోక్, స్వామి, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ మహ్మద్ గౌస్, ఆర్‌ఏఎఫ్ బలగాలు

ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ సామాజిక సేవాగుణాన్ని కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో మదువన్ కేపీ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్టులు కొన్ని కార్యక్రమాలకే పరిమితం కాకుండా మహిళలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలతో ముందుకు సాగాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవ అని గుర్తు చేశారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ డాక్టర్ లయన్ మిర్యం బాబు, సుఖినోభవంతు ఫౌండేషన్ వ్యవస్థాపకులు రత్నప్రభ, చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఈ.మాధవి, అధ్యక్షురాలు ఎం.శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభ్యాసం చేయాలి

చార్మినార్: గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా కుల వివక్ష పెద్ద ఎత్తున ఉన్నదని.. కుల వివక్షను పోగొట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందని మాదిగ హక్కుల జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ అన్నారు. శుక్రవారం మురళీనగర్‌లో జరిగిన హైదరాబాద్ జిల్లా మాదిగ హక్కుల దండోరా కార్యవర్గ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ, మాదిగ హక్కుల దండోర వ్యవస్థాపకులు యాతాకుల భాస్కర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పెంజర్ల శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన యువతీయువకులు పట్టుదలతో ఉన్నత విద్యాభ్యాసం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, వినాయక రావు, ప్రదీప్‌కుమార్, కిషన్, నరసింహ, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



చార్మినార్: ఫాల్గున ఏకాదశిని పురస్కరించుకుని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు తదితరులు శుక్రవారం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. వీరి వెంట చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు

నాంపల్లి: సీఎం సహాయ నిధి నుంచి తొమ్మిది మంది లబ్ధిదారులకు ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో లబ్ధిదారులను ఆహ్వానించి రూ.3.90,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు బత్తుల మనోహర్ బాబు, ఎల్.వెంకటేష్ పాల్గొన్నారు.

తృణధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



ఏజీవర్సిటీ: తృణధాన్యాలను ఆహారంగా తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డా. సత్యనారాయణ అన్నారు. పురాతన కాలంలో మన పూర్వీకుల ఆహారంలో తృణధాన్యాలు ఉండేవని భారతీయ తృణధాన్యాల పరిశోధన సంస్థ అధిపతి డాక్టర్ తారా సత్యవతి అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధన మండలి, తృణధాన్యాల పరిశోధన సంస్థ సంయుక్తంగా తృణ ధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి, గోధుమలతో పాటే తృణధాన్యాలు చేర్చడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు మిల్లెట్ శాస్త్రవేత్తలు విశ్వవిద్యాలయం ఆడిటోరియం నుంచి మిల్లెట్ పరిశోధన సంస్థ(ఐఐఎంఆర్)వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు తృణధాన్యాలపై నాటిక ద్వారా అవగాహన కల్పించారు. న్యూట్రిహబ్ సీఈఓ దయాకర్, కోరమండల్ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, వర్సిటీ అధికారులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

విజయనగర్‌కాలనీ: శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. శుక్రవారం విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమలో నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ.నవీన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్‌లను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ నిర్మల

నవీన్‌మిట్టల్‌కు సన్మానం

అబిడ్స్: ఇంటర్మీడియేట్ బోర్డు సెక్రటరీ నవీన్‌మిట్టల్‌ను తెలంగాణ ప్రైవేటు కళాశాలల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గౌరీ సతీష్ ఆధ్వర్యంలో సత్కరించి వారి సమస్యలను వివరించారు. అనుబంధ గుర్తింపును 3 నుంచి 5 సంవత్సరాలకు ఆమోదించినందుకు సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సంఘం నాయకులు ఉస్మాన్, హైదర్, అక్రమ్ పాల్గొన్నారు.



బోర్డు సెక్రటరీ నవీన్‌మిట్టల్‌ను సన్మానిస్తున్న గౌరీ సతీష్

నూతన ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన భోజ్యాకు జంగమ్మెట్‌కు చెందిన గిరిజన సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కలిసి సన్మానించారు. నాయకులు సభావత్ గిరిధర్ నాయక్, గణేష్ రాథోడ్, శంకర్ నాయక్, రాజు, మురళీ, ఛత్రూ నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌కు స్వాగతం..

చార్మినార్: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన భోజ్యా నాయక్‌ను టీటీడీపీ రాష్ట్ర కార్యదర్శి కప్ప కృష్ణా గౌడ్, కృష్ణ తదితరులు శుక్రవారం కలిసి స్వాగతం పలికారు.

ప్రభుత్వ పాఠశాలలో డీఆర్‌ఎఫ్ డెమో

గోల్కొండ: విపత్కర సమయాల్లో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమని గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్. అనురాధ దేవి అన్నారు. శుక్రవారం గోల్కొండ బడబజార్‌లోని ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాలలో డీఆర్‌ఎఫ్ సిబ్బంది డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అగ్నిప్రమాదాలు, భవనాలు కూలిన సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అందులో చిక్కుకున్న వారి ప్రాణాలను ఎలా కాపాడాలో వివరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎఫ్ సిబ్బంది వివిధ ఆపత్కర సమయాల్లో తాము వివిధ రకాల పరికరాలు, పనిముట్లు విద్యార్థులు చూపించి వాటి విశేషతలను వివరించారు.



విద్యార్థులకు డెమో చూపెడుతున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో శ్యాంబాబా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చార్మినార్: పాతబస్తీ బేలా నుంచి కాచిగూడ శ్యాంబాబా మందిరం వరకు మార్వాడీ మహిళా భక్తులు శుక్రవారం ఉదయం పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. చార్మినార్, గుల్జార్‌హౌజ్, మదీనా, నయాపూల్ ద్వారా కాచిగూడ వరకు జరిగిన ఈ ర్యాలీలో మహిళలు చేతుల్లో కాషాయ జెండాలను పట్టుకుని దారి పొడవునా భక్తి గీతాలు ఆలపించారు. చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి జరిగిన ప్రత్యేక పూజల్లో బీజేపీ నాయకులు చేతన్ కుమార్ సూరీ పాల్గొన్నారు. అలాగే బేలాలో జరిగిన పూజా కార్యక్రమంలో సతీష్‌కుమార్, బ్రిజ్ గోపాల్, జైస్వాల్, శ్యాం లోయా, సతీష్‌కుమార్, శ్రీకాంత్, రాజేష్ రాఠీ, గోపాల్ పాల్గొన్నారు.

‘అపోహలు, అపార్థాలతో జీవితాలను పాడు చేసుకోవద్దు’

గోల్కొండ: అపోహలు, అపార్థాలతో జీవితాలను పాడు చేసుకోవద్దని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. శుక్రవారం టోలిచౌకిలోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఆయన ఓ జంటకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారిద్దరి సమస్యలను విడివిడిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కలిసి ఉంటే కలదు సుఖం అంటూ ఉద్బోధించారు. భార్యాభర్తల మధ్య ఇతర కుటుంబసభ్యులు జోక్యం చేసుకోకూడదని, వారిద్దరి సమస్యలను సమష్టిగా వారే పరిష్కరించుకుంటే వారి మధ్య సఖ్యత పెరుగుతుందని ఆయన అన్నారు.



ఓ జంటకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మహ్మద్ నజీబ్

మైనర్ బాలికపై లైంగిక దాడి

గౌలిపురా: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మొఘల్‌పురా సుల్తాన్ షాహీ ప్రాంతానికి చెందిన ఎం.ఎ.రజాక్ ఫారూఖీ (45) ఓల్డా హోటల్ సమీపంలో గిఫ్ట్ షాపును నిర్వహిస్తున్నాడు. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలిక తన సోదరి జన్మదినం సందర్భంగా శుక్రవారం సాయంత్రం బెలూన్లను కొనుగోలు చేసేందుకు ఎం.ఎ.రజాక్ ఫారూఖీ దుకాణానికి వెళ్లింది. రజాక్ ఫారూఖీ మైనర్ బాలికను బెలూన్లను చూపిస్తూ తన షాపులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లింది. దీంతో తల్లిదండ్రులు బాలికను ఆరా తీయగా.. తనపై జరిగిన లైంగిక దాడి విషయాన్ని తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు జరిగిన ఘటనపై మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేయగా... పోలీసులు రజాక్ ఫారూఖీపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న రౌడీషీటర్ అరెస్టు

జియాగూడ: గంజాయి విక్రయిస్తున్న ఓ రౌడీషీటర్‌ను అరెస్టు చేసి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు. ఈ మేరకు ఆయన పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిందితుడి వివరాలు వెల్లడించారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బలరామ్ గల్లీ ప్రాంతానికి చెందిన మన్మోహన్‌సింగ్(43) గంజాయి విక్రయదారుడు. శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బల్‌రామ్‌గల్లీ ప్రాంతంలో రౌడీషీటర్ మన్మోహన్‌సింగ్ గంజాయిని విక్రయించడానికి యత్నిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గంజాయిని సూర్యాపేట్ ఏజెన్సీ ఏరియా నుంచి కొనుగోలు చేస్తూ విక్రయించడానికి యత్నిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ రవి మాట్లాడుతూ.. గంజాయిని విక్రయించడానికి వీలు లేదని, విక్రయించే వారికి కేసులను బట్టి ఏడాది పాటు కఠిన శిక్ష, రూ.10 వేల జరిమానా, అలాగే రెండు కేసులు నమోదు అయినట్లయితే పీడీయాక్ట్‌ను కూడా విధించడం జరుగుతుందన్నారు. గంజాయిని విక్రయించేది పూర్తిగా మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

‘కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి’

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి బీసీల సమగ్రాభివృద్ధి కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి డిమాండ్ చేశారు. 2023–24 వార్షిక బడ్జెట్‌లో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించి బీసీలకు అన్యాయం చేశారని ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి తిరిగి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న క్రమంలో బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో సవరించి బీసీలకు మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.